జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 7-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 665 పేజీలు: 4 వెల : రూ.7




# పురస్కారమా.. శిక్షా?

- ఉత్తమ ప్రతిభ కనబరచడమే తప్పా
- సారవకోటలో విద్యార్థుల చేతుల్లో మార్కుల బోర్డులు
- నేలపై మోకాళ్లపై కూర్చోబెట్టి అవమానం

శ్రీకాకుళం, మే 6 (వార్త): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలపాల్సింది పోయి, వారిని నేరస్తుల తరహాలో అవమానించిన ఘటన సారవకోటలో కలకలం రేపింది. రామన్న చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో విద్యార్థుల పట్ల వ్యవహరించిన తీరుపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నేరస్తుల మాదిరిగా చేతుల్లో బోర్డులు పెట్టి క్రైమ్ నంబర్లు వేసి నిలబెడుతుంటారు. ఇక్కడ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కూడా సరిగ్గా అదే అనుభవం ఎదురైంది. విద్యార్థులు సాధించిన మార్కులతో కూడిన బోర్డులను వారి చేతులతో పట్టుకోనిచ్చి నేలపై మోకాళ్ల మీద కూర్చోబెట్టారు. ఇది నాయకుల ప్రచార యావకు నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ఫొటోలకు పోజుల కోసమని ఇలా పదిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎండలో నిలబెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంచి మార్కులు సాధించినందుకు గౌరవించాల్సింది పోయి, ఇలా ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ దృశ్యాలు వైరల్ కావడంతో, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

## రెండేళ్లయినా మారని..
# రోడ్ల తలరాత!

- చెరువుల్లా మారిన రహదారులు
- పాతపట్నం నియోజకవర్గం రోడ్లపై ప్రయాణం నరకం
- ఉచిత హామీలకే పరిమితమైన నేతలు
- ప్రజాప్రతినిధులు, అధికారులపై స్థానికుల ఆగ్రహం







కొత్తూరు/హిరమండలం, మే 5 (వార్త): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్నా, ప్రధాన రహదారుల దుస్థితి ఎంత మాత్రం మారలేదని చెప్పడానికి పాతపట్నం నియోజకవర్గంలోని రహదారులే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఎన్నికల సమయంలో "ఆరు నెలల్లోనే రోడ్లను అద్దాల్లా మెరిపిస్తాం" అని హామీలు గుప్పించిన పాలకులు, నేడు క్షేత్రస్థాయిలో సమస్యలను గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారితో పాటు హిరమండలం కాంప్లెక్స్ వద్ద ఉన్న రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ముఖ్యంగా నివగాం వద్ద ప్రధాన రహదారి ప్రస్తుతం ఒక చెరువును తలపిస్తోంది. కొత్తూరు నుండి నివగాం, హిరమండలం నుండి సరుబుజ్జిలి వెళ్లే మార్గాల్లో భారీ గోతులు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నివగాం వద్ద సీసీ రోడ్డు నిర్మించి మురుగునీటి సమస్యను పరిష్కరించినప్పటికీ, సరైన నిర్వహణ లేక మళ్ళీ పాత పరిస్థితే పునరావృతమైంది. ఒడిశా రాష్ట్రానికి వెళ్లేందుకు ఇది ప్రధాన మార్గం కావడంతో నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. పగటిపూట ఏదోలా నెట్టుకొస్తున్నా, రాత్రి వేళల్లో ఈ గోతులు కనిపించకపోవడంతో కొత్తగా ఈ రూట్‌లో ప్రయాణించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు గోతుల్లో దిగబడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ తీవ్రమైన సమస్యపై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు నివగాం, హిరమండల గ్రామస్తులు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. నెలకు అనేకసార్లు ఎమ్మెల్యే కాన్వాయ్ ఇదే రహదారి గుండా వెళ్తున్నా, కనీసం కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో మారుమూల గ్రామంలో చిన్నపాటి రోడ్డు వేసి నియోజకవర్గం అంతా అభివృద్ధి చేసేశామని చెప్పుకోవడం తప్ప, కంటికి కనిపిస్తున్న ప్రధాన రహదారులను పట్టించుకోవడం లేదు అని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. కనీసం ఆర్అండ్‌బి అధికారులైనా తాత్కాలికంగా గుంతలు పూడ్చే చర్యలు చేపట్టకపోవడంపై వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల అభివృద్ధికి ఇంకెన్నేళ్లు వేచి చూడాలో పాలకులు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి నివగాం వద్ద ఉన్న రహదారిని, హిరమండలం కాంప్లెక్స్ రోడ్డును తక్షణమే పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

# రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



**మందస, మే 6(వార్త):** పలాస జీఆర్పీ పరిధిలో మందస రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో ఒకరు మరణించారు. జీఆర్పీ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస రైల్వే స్టేషన్ కు ఎగువకు వెళ్ళు రైలు పట్టాలపై జరిగిన రైలు ప్రమాదంలో సుమారు 32 నుంచి 35సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తి మరణించాడు. మృతుడు తెలుపు, నలుపు రంగు గల చెక్ షర్ట్, నలుపు రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడు. పలాస జీఆర్పీ కేసు ఫైల్ చేసి మృతదేహాన్ని హరిపురం గవర్నమెంట్ హాస్పిటల్ తరలించారు. మరిన్ని వివరాలకు పలాస జీఆర్పీ రైల్వే స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎ.కోటేశ్వరావు 9247585743, 9492250069 నంబర్స్ కు సంప్రదించాలని వారు ఆయన కోరారు.

## పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌వో ..

-సంతబొమ్మాళి, దండుగోపాల పురం, నౌపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన అనిత

-రికార్డులు, ల్యాబ్‌లు, పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలన

# ఆకస్మిక తనిఖీలు





**సంతబొమ్మాళి, మే 6(వార్త):** సంతబొమ్మాళి, దండుగోపాల పురం, నౌపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం డీఎంహెచ్‌వో కె.అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. గర్భిణులు, చిన్నారులకు ఇస్తున్న వ్యాక్సినేషన్, టీకాల నిల్వలు, ఉష్ణోగ్రత నిర్వహణ, రిజిస్ట్రేషన్ వంటి అంశాలను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయా.. లేదా అన్న అంశాలపై సిబ్బందితో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ల్యాబ్‌లను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్లను వివరాలు అడిగితెలుసుకున్నారు. 14 ఏళ్లు నిండిన బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ మరింత మెరుగుపరచాలని, ఇంకా ఎవరైనా వ్యాక్సినేషన్ తీసుకోని బాలికలకు వెంటనే పీహెచ్ఈఎల్‌కి రప్పించి అవగాహన కల్పించి వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధి నిరోధక చర్యలు క్రమంగా కొనసాగించాలని, ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారం రోజులగా కురుస్తున్న వర్షాలు, మరోపక్క పెరుగుతున్న ఉష్ణోగ్రతతో వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైతే గాని ప్రజలు బయటకు రాకుండా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సంతబొమ్మాళి పీహెచ్‌సీలో వైద్య చికిత్స పొందుతున్న రోగులకు, ఆశ కార్యకర్తకు డీఎంహెచ్ఓ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. నౌపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక పడి ఉన్న వాడిన సూదులు, ఇంజక్షన్లు చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సచివాలయాలను ఆమె సందర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ గత ఏడాది నుంచి లేరని ప్రశ్నించగా త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. బోరుభద్ర, దండుగోపాల పురం, సంతబొమ్మాళి ఆరోగ్యకేంద్రాల్లో సిబ్బంది కొరతపై ప్రశ్నించగా త్వరలోనే సిబ్బందిని అందిస్తామన్నారు. ఈ తనిఖీల్లో సంతబొమ్మాళి, దండుగోపాలపురం, నౌపాడ వైద్యులు డాక్టర్ నందిని, డాక్టర్ పల్లవి, డాక్టర్ విశ్వనాథ్ గంగాధర్, డాక్టర్ పరిమళతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



**సోంపేట, మే 6 (వార్త):** కొర్లాం పంచాయతీ గొనకపాడు గ్రామంలో శ్రీ కోదండ రామ విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి ధాన్యాధివాసం, జలాధివాసం, క్షీరాదివాసం, నవగ్రహ శాంతి యజ్ఞం చేపట్టారు. అనంతరం స్వామివారికి రుత్వికులు పూర్ణచంద్ర పాణిగ్రాహి, గిరిపాత్రో, కిరణ్ పాత్రో, రవి పాత్రో మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళం అందించిన రాం బుడ్డి క్రాంతి కుటుంబానికి గ్రామస్తులు అభినందించారు.

## సాగునీటి కాలువల మరమ్మతులకు..

# నిధుల కేటాయింపుపై హర్షం

**పలాస, మే 6(వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సాగునీటి కాలువలను బాగుచేసేందుందుకు నిధులు కేటాయించారని నీటి సంఘం అధ్యక్షులు గుణప నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పలాస మున్సిపల్ పరిధిలో నీలపురం, జేఆర్ సిపురం, తాళపద్ర కాలువలను, వజ్రపుకొత్తూరు మండలం పల్లి సారది, రిట్టపాడు కాలువలలు మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి కాలువల మరమ్మతులకు ప్రభుత్వం భారీ నిధులు కేటాయిస్తోందిని, ఇది రైతులకు హర్షానందం కలిగించిందని, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వంశధార కాలువలు, చెరువుల పునరుద్ధరణకు రూ.30 కోట్లు 'జలధార' పథకం ద్వారా మంజూరయ్యాయని తెలిపారు.శ్రీకాకుళం జిల్లాలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో రూ.7.01 కోట్లతో 62 మరమ్మతు పనులు, వంశధార కాలువలకు అదనంగా రూ.6 కోట్లు కేటాయించారని, ఎల్ఎన్పేట, నరసన్నపేట, హిరమండలం వంటి మండలాల్లో పూడి తొలగింపు, సూయిజ్ల మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని నీటి సంఘం అధ్యక్షులు తెలిపారు. ఈయనతో పాటు ఏ ఈ ఇ శ్రీనివాసరావు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## అంబుగాం ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఘనత



**మందస, మే 6(వార్త):** ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు అసలైన పునాది అని నిరూపిస్తూ అంబుగాం విద్యార్థులు మరోసారి నిరూపించారు. మందస మండలంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల(అంబుగాం)కు చెందిన నలుగురు విద్యార్థులు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఎంపికై సంచలనం సృష్టించారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విద్యార్థులు మజ్జి నివాన్ శ్రీచంద్ర సాయి జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు సాధించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటాడు. తోట సృజీవన్ అంపోలు రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికయ్యాడు. తుంగాన ప్రత్యూష, పద్రి నియా పలాస రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థులను జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థుల కోసం వేసవిలో వెన్నెల అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తుమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను ప్రోత్సహించడం, ఆటపాటలు, డాన్స్ వంటి కార్యక్రమాల ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని, నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, మరియు విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలే వేదికలని కొనియాడారు.

కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మజ్జి శంకరరావు, పద్రి ఈశ్వరరావు, కొరియోగ్రాఫర్ పవన్ కుమార్, సిందిరి భామిని తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ విజయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జేసీఐ సేవలు అద్భుతం



**ఇచ్ఛాపురం, మే 6(వార్త):** జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు బోయినా శ్రవణ్ బృందం, జేసీఐ ఇండియా ఫౌండేషన్‌కు చేసిన విశిష్ట సేవల కోసం సెనేట్ సభ్యుల నుంచి ఘనమైన ప్రశంసలు అందుకున్నారు. జోన్-4కు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎస్ రాకేష్ నాయర్ మొదటి అధికారిక పర్యటన సందర్భంగా, సెనేట్ బోర్డ్‌కు రూ. 33,500/- విలువైన ముఖ్యమైన విరాళం అందించారు. ఈ విరాళాన్ని ఇచాపురానికి చెందిన ప్రసిద్ధి గాంచిన వ్యక్తి, అడ్వైజర్ సెనేటర్ పైడిసెట్టి దినేష్ అందించారు. ఆయన చేసిన ఈ గొప్ప విరాళం కార్యక్రమంలో ఉన్న సభ్యులందరినీ ఆకట్టుకుంది. వారి కృషి, నిబద్ధతకు గుర్తింపుగా, జోన్-4 అధ్యక్షుడు చైతన్య వసంతవాడ సమక్షంలో అధ్యక్షుడు శ్రవణ్ బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంతోష్ ఎం. స్వరూప్, టీ.శణ్ముఖ్, కల్లా జైదేవ్, పి.స్నిగ్ధ, కె.మల్లేశ్, ఏఎస్ఐ ధర్మరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లివూరులో వివాహిత అనుమానాస్పద మృతి



**పలాస, మే 6 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం పల్లివూరులో వివాహిత అనుమానాస్పద మృతి చోటుచేసుకుంది. గర్తం ఇందు అనే మహిళ ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిందని, భర్త శంకర్ విదేశాల నుంచి ఇటీవల గ్రామానికి వచ్చాడని, ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నట్లు సమాచారం అందుతుందని పోలీసులు తెలిపారు . మృతురాలి తల్లి ఇది హత్య అని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. హత్య లేక ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేపట్టామని, దర్యాప్తు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి భర్తను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోవడం విషాదంగా మారింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వజ్రపు కొత్తూరు ఇంచార్జ్ ఎస్ఐ కృష్ణ ప్రసాద్ వెల్లడించారు.

## ఘనంగా గుమ్మడి పోలమ్మ ఆలయ ప్రతిష్ఠ



**మెళియాపుట్టి, మే 6 (వార్త):** జాడేపల్లి గ్రామంలో గుమ్మడి పోలమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గడచిన మూడు దినాలుగా గుమ్మడి పోలమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహణ జరుగుతుంది. దీంట్లో భాగంగానే మూడవ రోజు అయిన బుధవారం నాడు హోమము విగ్రహ ప్రతిష్ట తో పాటు భక్తులు గ్రామస్తులు మేళ్ల తాళాలతో భక్తి గీతాలు ఆలాపన, అన్నసంతర్పణ కార్యక్రమం తదుపాటు సాయంత్రికలో భక్తి గీతాలు, భజన కార్యక్రమం తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను సైతం గ్రామస్తులు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అంతకుముందు గుమ్మడి పాలెం ఆలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందురావు బుధవారం నాడు జాడుపల్లి గ్రామంలోనున్న గుమ్మడి పోలమ్మ దేవత ఆలయానికి సందర్శించి దైవ దర్శనం గావించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారముగా 25 వేల రూపాయలను అందించారు. ఈ సందర్శనలో ఆయనతోపాటు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అనుమానం వస్తే కాల్ చెయ్యండి



**పలాస, మే 6 (వార్త):** అనుమానం వస్తే కాల్ చేయాలని పలాస మున్సిపల్ కమీషనర్ ఐ శ్రీనివాసులు కోరారు. బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ పలాస మున్సిపాలిటీ ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం అందించి వారికి సహకరించాలని కోరారు. 2027 జనాభా లెక్కల్లో భాగంగా ఇళ్ల జాబితా, ఇండ్ల గణన కార్యక్రమం శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రారంభమైందని, మే1నుండి ప్రారంభమై ఈ నెల 31 వరకు కొనసాగనున్న ఇండ్ల గణన కార్యక్రమం కోసం సెన్సస్ ఎన్యుమరేటర్లు తమ శిక్షణ పూర్తిచేసుకుని, పలాస కాశీబుగ్గ జంటపట్టణాల్లో ఇండ్ల గణన కార్యక్రమంలో బిజీ బిజీగా ఉన్నారు. ఈసందర్భంగా పలాస కాశీబుగ్గ మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇండ్ల గణన అనే కార్యక్రమం ముఖ్యఉద్దేశం ప్రజల ఆర్ధిక స్థితిగతులు తెలుసుకుని దేశ ప్రణాళిక, అభివృద్ధికి తోడ్పాటును అందించడమే కేంద్రప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఇళ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం అందించి వారికి సహకరించాలని కోరారు. పట్టణంలో 103 మంది ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన కార్యక్రమంలో ఉన్నారని, వారంతా స్థానిక వార్డ్ సచివాలయ సిబ్బందేనని, ప్రజలిచ్చే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందన్నారు. అపరిచిత వ్యక్తులుగా భావిస్తే తమకు నేరుగా ఫోన్ ద్వారా సంప్రదించి సమాచారమందించాలని పట్టణవాసులను కమీషనర్ శ్రీనివాస్ కోరారు.

# కదిలిన పంచాయతీ సిబ్బంది

**-జాతీయ వార్త కథనంపై స్పందన**

**- అడ్డగోలు నిర్మాణాలే మురుగునీరు ప్రవాహానికి అడ్డంకులని గుర్తింపు**

**-తక్షణ చర్యలు చేపట్టిన వైనం**



**సోంపేట, మే 6 (వార్త):**'చిన్న వర్షానికే రోడ్డంతా మురుగుమయం ' అనే శీర్షికన బుధవారం జాతీయ వార్తలో ప్రచురితమైన కథనానికి సోంపేట పంచాయతీ అధికారులు సిబ్బంది స్పందించారు. వెంటనే కదిలారు. మెయిన్ రోడ్ లో సావిత్రి నర్సింగ్ హోమ్ ఎదురుగా షాపుల ముందు గుండా వెళ్లే కాలువలో అడ్డంకులను తొలగించే పనులు చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను మట్టిని విపరీతంగా బయటకు తొలగించినప్పటికీ కొన్ని షాపుల ఎదుట ఇష్టారాజ్యంగా చేపట్టిన నిర్మాణాలు మురికినీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో.. ఎక్కడికక్కడే నీరు విపరీతంగా నిలిచిపోయి వర్షాలు పడే సందర్భంలో మెయిన్ రోడ్డు మీదకు మురుగు తొక్కేస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు అంతా కంపు..కంపుగా మారుతోంది. భరించలేని దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

## అడ్డగోలు నిర్మాణాలతోనే సమస్య

మెయిన్ రోడ్‌లో అటు గీతా మందిరం నుంచి ఇటు హై స్కూల్ గ్రౌండ్‌కి వెళ్లే మార్గం వరకు మధ్యనున్న షాపుల నిర్మాణం అడ్డగోలుగా ఉన్నట్లు పంచాయతీ సిబ్బంది గుర్తించారు. ముఖ్యంగా అదే వరుసలో మన లోకల్ మాల్ షాప్ వద్ద పక్కనున్న పాన్ షాప్ వద్ద మురికి నీరు ప్రవహించే కాలువ ఎత్తు చేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని సిబ్బంది గుర్తించారు.

ఆయా షాపుల నిర్మాణం సమయంలోనే ఇష్టారాజ్యంగా కాలువ ఎత్తు కూడా పెంచేయడంతో పైనుంచి వచ్చే మురుగునీరు ఇక్కడ నిలువగా ఉండిపోతూ వర్షాలు పడే సందర్భాల్లో సమస్యలు సృష్టిస్తోంది. ఈ సమస్యను పంచాయతీ సిబ్బంది ఈవో శాంతకుమారి దృష్టిలో పెట్టినట్టు తెలి సింది. ఈ సమస్యను ముందుగా ఆయా షాపుల యజమానులకు తెలియజేసి వారే స్వయంగా కాలువను సరిచేయాలని తెలియజేసేందుకు సిద్ధమవుతున్నారు. లేనియెడల ఆయా షాపులు ఎదురుగా చేపట్టిన నిర్మాణాలు తొలగించి స్వయంగా కాలువకు మరమ్మతులు జరిపిస్తామని ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ సమస్య ఎప్పటికీ పూర్తవుతుందో వేచి చూడాల్సి ఉంది.



ఈ షాపు వద్దనే కాలువ ఎత్తు పెంచేయడంతో నిలిచిపోతున్న మురుగు

## టి.లింగాలపాడులో ఘనంగా వటలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ



**జలుమూరు, మే 6(వార్త):** టి.లింగాలపాడులో శ్రీ కాత్యాయని సమేత వటలింగేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల ఆహ్వానం మేరకు నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి కనిపించగా, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికారి ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, జలుమూరు మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దుంగ స్వామిబాబు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, సర్పంచ్ చల్ల షణ్ముఖరావు తదితర ప్రజాప్రతినిధులు, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక చైతన్యం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని నాయకులు ఆకాంక్షించారు.

## శ్రీవాసుదేవుని సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ

**-స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు**

**-శ్రీసుదర్శన పెరుమాళ్ కు ప్రత్యేక పూజలు**

**నిర్వహించిన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు**



**మందస, మే 6(వార్త):** శ్రీవాసుదేవుని సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. రెండు రోజులుగా శ్రీసుదర్శన్ పెరుమాళ్ స్వామికి ప్రత్యేక పూజలు, వాసుదేవునికి మూలా నక్షత్రయుత అభిషేకాలతో జరుగుతుండడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. 14వ శతాబ్ధంలో మంజూష సంస్థానాన్ని పరిపాలించే శ్రీరాజమణిదేవ్ కాంచీపురం నుంచి తీసుకువచ్చిన అద్భుతమైన మూర్తుల్లో శ్రీసుదర్శన పెరుమాళ్ విగ్రహం ప్రత్యేకమైనదిగా అర్చకులు చెబుతారు. శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వాసుదేవుని ఆలయ జీర్ణోద్ధరణ చేశారు. దీంతో ఆలయానికి పూర్వ వైభవం వచ్చింది. శ్రీసుదర్శన పెరుమాళ్ విగ్రహానికి ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అదేవిధంగా బుధవారం వాసుదేవుని జన్మతిథి నక్షత్రమైన మూలానక్షత్రం రోజున ప్రత్యేక అభిషేకాలు చేశారు. స్వామి మూలానక్షత్రయుతదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం భక్తులు కల్పించడం ఆనవాయితీ వస్తోంది. స్వామి ప్రత్యేక అభిషేకాలు చేసిన అర్చకులు భక్తులకు నిజరూపదర్శనం కావించి, అనంతరం దివ్యాలంకృతుని చేశారు. శ్రీవాసుదేవుని అనిర్వచనీయమైన మూర్తిత్వాన్ని దర్శించుకుని, భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలు అర్చకులు అందజేశారు.



# సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**- సమన్వయంతో విజయవంతం చేయాలి**

**-పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపు**

**నరసన్నపేట, మే 6(వార్త):** ఈనెల 16న నరసన్నపేటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో పట్టణంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ క్యాడర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పాల్గొని పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి వార్డులో అధికారులతో సమన్వయం చేస్తూ కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు, కార్యకర్తలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు అన్ని విభాగాల మధ్య సమన్వయం మెరుగుపరచాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమీరాకు బాసటగా శ్యాంప్రసాద్ రెడ్డి

**ఇచ్ఛాపురం, మే 6 (వార్త):** బూర్జపాడు పంచాయతీ డొంకూరు గ్రామానికి చెందిన దున్న సమీర (15సంలు) డొంకూరు హై స్కూల్లో 10వ తరగతి చదువుతున్న అమ్మాయి. గత సంవత్సరం 9వ తరగతి చదువుతుండగానే బోన్ మారో కేన్సర్ వల్ల అచేతను రాలైంది. కదలలేని స్థితిలో సైతం తన కెంతో ఇష్టమైన చదువుని వదులుకోలేదు. ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షను వీల్ ఛైర్ లో స్క్రైబ్ సహకారం తో రాసి ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణురాలైన బాలిక సంకల్పం ముందు వైకల్యం ఓడిపోయింది. కేన్సర్ తనకిష్టమైన ఖో ఖో ఆటను ఆటంకపరచింది కానీ తన సంకల్పాన్ని ఏమాత్రం తగ్గించలేకపోయింది. సమీర సంకల్పాన్ని, మనోనిబ్బరాన్ని, చదువుకోవాలనే పట్టుదల పత్రికలో చూసిన ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పెద్ద మనసుతో స్పందించి డొంకూరు లో ఉన్న దున్న సమీర ఇంటికి వెళ్లి అభినందించారు. ఆమె సంకల్పానికి స్ఫూర్తిని కలిగించే ఆమె పట్టుదలకు ప్రశంసించి శాలువాతో సన్మానం చేసి, సరస్వతీ పుత్రికైన సమీరకు సరస్వతి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. సమీర విద్యా కుసుమమైనా పేదరికం ఆమెని కృంగదీస్తుంది. కేన్సర్ బారిన పడిన బాలిక కు వైద్యానికి నెలకు 20 వేల రూపాయలు ఖర్చు ఆ పేద కుటుంబానికి భారమౌతుంది. సమీర తండ్రి వలస కూలీ, తల్లి పాప యొక్క బాగోగులు చూసుకుంటూ ఆర్థికంగా కష్టాలతో వైద్యానికే ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీని అటకెక్కించింది. కనీసం నడవలేని సమీర కు 88 శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ ఉన్నప్పటికీ దివ్యంగుల పెన్షన్ కూడా మంజూరు చెయ్యలేనితనానికి బాధ పడుతూ ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసేటంతవరకు తాను ప్రతి నెలా 2500 రూపాయలు ఇస్తానని శ్యాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. సమీర అనారోగ్యం, వైకల్యం గూర్చి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కి, వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ కి శ్యాంప్రసాద్ తెలియపరస్తూ ప్రభుత్వ పరంగా సహాయాన్ని కోరారు. అలాగే ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మాజీ కో అప్షన్ సభ్యులు ప్రత్తి విజయ్ కుమార్ తన మనవడు ప్రత్తి యారోన్ పుట్టినరోజు సందర్భంగా 2500 రూపాయలు అందించారు. మొదటి నెల పింఛను 2500 తో కలిపి 5వేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు సల్ల దేవరాజు, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, మాజీ సర్పంచ్ బుడ్డ కళ్యాణ్, సంగారు లక్ష్మణరావు పాల్గొన్నారు.



## నరసన్నపేటలో పారిశుధ్య పనులపై కలెక్టర్ అసహనం



**నరసన్నపేట, మే 6(వార్త):** నరసన్నపేటలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ బుధవారం పరిశీలించారు. గొలివి మోహన్ హాస్పిటల్ రహదారిలో నెల రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలోని 20 వార్డుల్లో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఎక్కడికక్కడ ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పనులు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వరూపరాణి, డీఎల్పీఓ గోపి బాల తదితరులు పాల్గొన్నారు.

## నేరడి బ్యారేజీతో శ్రీకాకుళం సస్యశ్యామలం

**-పలాస జనసేన ఇన్ చార్జి డాక్టర్ దుర్గారావు**

**-జనసేన నాయకులతో కలసి ప్రాజెక్ట్ ప్రతిపాదిత స్థలం సందర్శన**



**పలాస, మే 6 (వార్త):** వంశధార నదిపై నేరడి వద్ద బ్యారేజీని పూర్తి చేస్తే శ్రీకాకుళం జిల్లా సస్యశ్యామలం అవుతుందని పలాస నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జి డాక్టర్ దుర్గారావు అన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, నందిగామ ధర్మారావు, కీలు సునీల్ వర్మ, ఈరోతు రామ్ మెట్ట దుర్గాప్రసాద్ తదితరులతో కలసి నేరడి బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని బుదవారం సందర్శించారు. గొట్టా బ్యారేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గారావు మాట్లాడుతూ నేరడి బ్యారేజీ నిర్మాణం అనేది శ్రీకాకుళం జిల్లా వాసుల దశాబ్దాల కల అన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు అన్ని తొలగిపోవడం శుభ పరిణామమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేయడంతో ఇప్పటి వరకూ ఉన్న సమస్యలు తొలగిపోయాయన్నారు. సరైన కార్యాచరణతో నేరడి బ్యారేజి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తాము కోరుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకి శ్రీకాకుళం రైతాంగం తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కొత్త పోలీసుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**- కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి**




**పలాస, మే 6 (వార్త):** పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్ ఐ ఆర్ నరసింహమూర్తి తెలిపారు. బుధవారం కోసంగిపురం గ్రామ సందర్శించి గ్రామ జంక్షన్లో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ప్రజలకు కోరారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, మొదలైన వాటి గురించి అవగాహ కల్పించారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీవై పార్టీలో పలువురి చేరిక

**ఇచ్ఛాపురం, మే 6 (వార్త):** విజయనగరంలోని బీసీవై పార్టీ కార్యాలయంలో భారతచైతన్య యువజన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బోడ రామచంద్రయాదవ్ సమక్షంలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన 35 మంది నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ బడ్డి మురళి మాట్లాడుతూ రామచంద్ర యాదవ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీకి చేరుతున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక స్వాగతం పలికారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తూ, గ్రామ గ్రామాన పార్టీ జెండాను ఎగరవేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. మీరందరూ కేవలం సభ్యులు కాదు, రేపటి నాయకులు... పార్టీకి బలం, ప్రజలకు ఆశగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయంగా దారి చూపిన నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ పట్ల తాను జీవితాంతం రుణపడి ఉంటానని, ఆయన ఆశయ సాధన కోసం, పార్టీ అభివృద్ధి కోసం తన చివరి శ్వాస వరకు అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మరింత బలపడుతూ, ప్రజల మద్దతు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జొన్న రైతుకు గిట్టుబాటు వచ్చే వరకూ పోరాడుతాం



**నరసన్నపేట, మే 6 (వార్త):** జొన్న రైతులకు గిట్టుబాటు ధర వచ్చే వరకూ పోరాడుతామని పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య మండిపడ్డారు. బుధవారం పోలాకి మండలం తల సముద్రం గ్రామంలో జడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పర్యటించారు. క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరి శీలించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లా డుతూ.. ప్రభుత్వ ఉదాసీనత వల్ల రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో క్వింటా జొన్నకు రూ. 2,100 వచ్చేదని, నేడు కూటమి పాలనలో కేవలం రూ. 1,600లకే అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడిందన్నారు. క్వింటాకు రూ. 500 మేర నష్టపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో జొన్న రైతుల పరిస్థితి అగమ్య గోచ రంగా మారిందని, గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మద్దతు ధరకే ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి రైతులను దళారుల నుంచి కాపాడాలన్నారు.



### ఉద్యోగ విరమణ చేసిన
## హోంగార్డుకు ఆర్థిక చేయూత

**శ్రీకాకుళం, మే 6 (వార్త):** జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా విశేష సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెద్దింటి శంకర్ రావుకు ఆర్థిక సహాయంగా రూ. 4.03 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. జిల్లాలో విధులు నిర్వహి స్తున్న హోంగార్డు సిబ్బంది అంతా స్వచ్ఛందంగా తమ ఒక్క రోజు డ్యూటీ అల వెన్సును విరాళంగా సమకూర్చడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించడం జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన లేదా విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుం బాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇటువంటి సంక్షేమ కార్యక్రమం చేపట్టడం విశేషం.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శంకర్ రావు పోలీసు శాఖలో అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించారని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.హోంగార్డు సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఒక్క రోజు డ్యూటీ అలవెన్సును అందించడం అభినందనీయమని, ఇటు వంటి చర్యలు పోలీసు కుటుంబంలో ఐకమత్యాన్ని పెంపొందించడమే కాకుండా, అవసర సమయంలో పరస్పరం అండగా ఉండే భావనను బలపరుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### అన్ ఎయిడెడ్ పాఠశాలలో ప్రవేశాలకు
## రెండో విడత ఫలితాలు విడుదల

**శ్రీకాకుళం, మే 6 (వార్త):** విద్య హక్కు చట్టం 2009 సెక్షన్ 12 (1)( సి ) ప్రకారం 2026 - 2027 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు సంబంధించి లాటరీ విధానం ద్వారా ఎంపిక చేయబడిన విద్యార్థుల రెండో విడత లాటరీ ఫలితాలు విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష, శ్రీకాకుళం అదనపు ప్రాజెక్టు కో -ఆర్డినేటం పి. వేణుగోపాలరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వారి వివరాలను పాఠశాలల్లో చూడవచ్చని ఇతర విషయాలకు సంబంధింత మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని, పాఠశాల వెబ్సైట్లో చూడాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ధ్రువీకరణపత్రాలతో (విద్యార్థి ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డు, ఆదాయ దృవీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, తోబుట్టువుల ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్) ఆధారాలతో, తేదీ. 6.5.2026 నుండి తేది. 17.5.2026 లోగా ఎంపికైన పాఠశాలలకు వెళ్లి తమ ప్రవేశాలను నిర్ధారించుకోవాలని తెలిపారు.అర్హులైన విద్యార్థులకు వారి యొక్క ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అడ్మిషన్లు ఇవ్వాలని సంబంధిత పాఠశాల యాజమాన్యాలకు ఆయన తెలియజేశారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇతర విషయాలకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 8599 సంప్రదించవచ్చునని తెలిపారు.

### ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026కు
## దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మే 6 (వార్త):** జిల్లాలో వివిధ రంగాల్లో అసాధా రణ ప్రతిభ కనబరిచిన బాలల నుంచి 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026' కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు మరియు సంస్కృతి విభాగాల్లో విశిష్ట గుర్తింపు పొందిన బాలలు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. 5 ఏళ్లు పైబడి, 31 జూలై 2026 నాటికి 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలలు వ్యక్తిగతంగా లేదా ఏదైనా సంస్థ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని ఆయన వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలు, ప్రతిభకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు మరియు పత్రికా క్లిప్పింగ్‌లతో https://awards.gov.in అనే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేయడానికి జూలై 31, 2026 ఆఖరు తేదీ అని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతిభావంతులైన బాలలు ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.


## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**శ్రీకాకుళం, మే 6 (వార్త):** రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు అసిస్టెంట్ లోకో పైలట్, గ్రూప్-డి మరియు ఎ.పి.హైకోర్టు-2026 రిక్రూట్మెంట్ పరీక్షలకు జిల్లా లోని వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుండి ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోగా ఏపీ బీసీ స్టడీ సర్కిల్, శ్రీకాకుళం వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 100 మంది అభ్యర్థులకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్ మరియు స్టడీ మెటీరియల్ అందజేయనన్నట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు, రైల్వే రిక్రూట్మెంట్, గ్రూప్ డి - 2026 లకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉచిత శిక్షణకు అర్హులని, ఎంపిక విధానం : డిగ్రీ పదవ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీ నుండి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల తమ బయోడేటా పాటు 10వ తరగతి మార్కులు లిస్టు, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు మాత్రమే, ఆధార్ మరియు బ్యాంక్ పాస్ బక్ జిరాక్స్, పోస్టులకు దరఖాస్తు చేసుకున్న జిరాక్స్, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరచి అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా బీసీ స్టడీ సర్కిల్, ఎన్టీఆర్ భవన్, 80 ఫీట్ రోడ్డు, వాంబే కాలనీ, శ్రీకాకుళం కార్యాలయం నందు దరఖాస్తులు ఇవ్వబడునని, దరఖాస్తులు స్వీకరించబడునని ఇతర వివరములకు బీసీ స్టడీ సర్కిల్ ఫోన్ నెంబర్: 8332852106, 9642707174 లను సంప్రదించగలరని సూచించారు.

## చట్టాలపై అవగాహన కల్పించండి

### మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

**శ్రీకాకుళం, మే 6 (వార్త):** సామాన్య ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి, వారికి న్యాయ సహాయం అందేలా చేయడంలో పారా లీగల్ వాలంటీర్లు (పీఎల్వీ) వారధిలా పనిచేయాలని మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సి.హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో మూడు రోజుల పాటు జరిగిన పీఎల్వీల అడ్వాన్స్డ్ శిక్షణ కార్యక్ర మం బుధవారంతో ముగిసింది. మోటారు వాహనాల చట్టం, విద్యా హక్కు, పోక్సో, పర్యావరణ సమస్యలతో పాటు లైంగిక కార్మి కులు, దివ్యాంగులు హెచ్ఐవీ బాధితుల హక్కులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో న్యాయ సేవా సంస్థల ద్వారా బాధితులకు అందే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, ఎంవీఐ గంగాధర్, ప్యానల్ న్యాయవాది అన్నేపు భువనేశ్వర రావు, ఇన్ స్పెక్టర్ నారాయణి, విద్యా ఫౌండేషన్ ప్రతినిధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించండి

* పారిశుధ్య నిర్వహణలో రాజీ పడవద్దు * సుందర నరసన్నపేటకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * సత్యవరం కూడలి నుంచి పెద్దపేట వరకూ కాలినడకన పారిశుధ్య పనుల పరిశీలన

**నరసన్నపేట, మే 6 (వార్త):** నరసన్నపేటను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. బుధవారం నరసన్నపేట చేరుకున్న కలెక్టర్, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించారు. పారిశుధ్య నిర్వహణలో రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి లక్ష్యాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు సమయం ఆసన్నమైన తరుణంలో, నరసన్నపేటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పట్టణంలోని 20 వార్డులకు గానూ ప్రత్యేకంగా ఇన్చార్జ్ అధికారులను నియమించారు. వీరిలో 20 మంది ఎంపీడీఓలు, 20 మంది డిప్యూటీ ఎంపీడీఓలు, 50 మంది పంచాయతీ కార్యదర్శులు, 10 మంది తహసీల్దార్లతో పాటు భారీగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి వార్డులోనూ పారిశుధ్య పనుల కోసం ప్రత్యేకంగా 20 మంది కార్మికులను, ట్రాక్టర్లను కేటాయించి పారిశుధ్య విప్లవానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ తన పర్యటనలో భాగంగా సత్యవరం కూడలి నుండి పెద్దపేట వరకు కాలినడకన వెళ్లి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్గమధ్యంలోని వ్యాపారులతో మాట్లాడుతూ.. షాపుల ముందు చెత్త వేయకూడదని, రోడ్లపైకి నిర్మాణ సామాగ్రి,



ఇసుక రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరిస్తూనే, పట్టణ పరిశుభ్రతలో వ్యాపారులు భాగస్వాములు కావాలని కోరారు. మెయిన్ రోడ్డుపై ఎక్కడా చెత్త కనిపించకుండా చూడాల్సిన బాధ్యత ఆయా దుకాణదారులదేనని స్పష్టం చేశారు. అనంతరం పచూరి కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం చేపట్టిన ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, తద్వారా నరసన్నపేటను ఒక మోడల్ పట్టణంగా నిలబెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకటరమణ ఎంపీడీవో రవికుమార్, ఏఎస్ఐ తులసి నాయుడు పంచాయతీ ఈవో ద్రాక్షాయిని, సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణలో నిర్లక్ష్యం వద్దు

* టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎస్పీ లక్ష్మణరావు * అభయం హెల్మెట్ బ్యాంకు ప్రారంభం

**టెక్కలి/సంతబొమ్మాళి, మే 6 (వార్త):** హెల్మెట్ ధారణలో నిర్లక్ష్యం చేసి ప్రాణాలు కోల్పోవద్దని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎస్పీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం టెక్కలి పట్టణంలో ఏర్పాటు చేసిన అభయం హెల్మెట్ బ్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం టెక్కలి పట్టణంలోని డిగ్రీ కాలేజీ నుండి ఇంద్ర చౌక్ వరకు పోలీసులు, అధికారులు ప్రజల్లో రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రమాదాలు తగ్గించేందుకు వాహనచోదకుల కోసం అభయం హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టెక్కలి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.విజయ్ కుమార్, టెక్కలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# యువత క్రీడల్లో రాణించాలి

* ఎమ్మెల్యే కూన రవికుమార్ * ఎమ్మెల్యే కప్ టీ20 క్రికెట్ టోర్నీ ప్రారంభం




**ఆమదాలవలస, మే 6 (వార్త):** ఆమదాలవలస పట్టణంలోని జూనియర్ కాలేజీ మైదానంలో ఎమ్మెల్యే కప్ టీ20 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెరగడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. ప్రభుత్వం కూడా క్రీడా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. తొలుత బ్యాటింగ్ చేసి ఈ టోర్నీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, టిడిపి ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








### ప్రభుత్వ పాఠశాలల్లోనే..
# నాణ్యమైన విద్యాబోధన

* మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి * డీఈవో రవిబాబు * గూడేంలో బడి పిలుస్తుంది * గ్రామంలో ర్యాలీ చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

**శ్రీకాకుళం, మే 6 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.. ఇక్కడ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారు.. బాగా చదువు చెబుతున్నారు.. ఇటీవల టెన్త్ ఫలితాల్లోనూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారు.. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించి డబ్బులు వృథా చేసుకోవద్దు.. అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు తెలిపారు. గూడేంలో నిర్వహించిన బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై ప్రభుత్వం ముందస్తుగానే దృష్టి సారించిందని, ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలను (అయిదు సంవత్సరాలు పూర్తయిన వారు) ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించేందుకు పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. గడిచిన కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో అధికారులు, ఉపాధ్యాయులు పర్యటిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, అందిస్తున్న పథకాలను వివరించి ప్రవేశాలను ప్రోత్సహిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారితో సమగ్ర శిక్షా అధికారి పి.వేణుగోపాలరావుతో కలసి శ్రీకాకుళం మండలం గూడేం గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆధునిక బోధన, అధునాతన సామగ్రి, అర్హత గల ఉపాధ్యాయులు, ప్రవేశాలు




పొందే వారికి ప్రభుత్వం అందిస్తున్న విద్యార్థి మిత్ర (పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు, బ్యాగు, బెల్టు) పథకం ద్వారా ఉచితంగా కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం (డొక్కా సీతమ్మ) ద్వారా పౌష్టికాహారం, తదితరాల గురించి తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. గూడేంలో నిర్వహించిన బడి పిలుస్తుంది కార్యక్రమంలో 22 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు వివరించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శార్వాణి, ఎపిసి పి. వేణుగోపాలరావు, డిప్యూటీ డిఈఓ విజయ కుమారి, పాఠశాల కమిటీ అధ్యక్షులు కె.యర్రయ్య, ఎంఈఓలు నత్తల కృష్ణ, పెంకి సుజాత, సిఎంఓ బి. శ్రీధర్, ఎఎంఓ సుధాకర్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గుంట లక్ష్మణ్ రావు, సర్పంచ్ ప్రతినిధి అప్పల రాజు, గ్రామ పెద్ద నల మహారాజు, ఉపాధ్యాయులు ధర్మారావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, వెంకట్రావు, జగన్నాథం, నీలవేణి ,హేమలత, ధనలక్ష్మి, లీల, సునీత మధుబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts college wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546